క్లుప్తంగా

స్థాయిని మించి వైద్యం చేయొద్దు..

జూలూరుపాడు: గ్రామీణ వైద్యులు స్థాయికి మించి వైద్యం చేయరాదని భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రం జూలూరుపాడులోని పలు ఆర్ఎంపీ క్లినిక్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, సిరంజలు, ప్రిస్క్రిప్షన్లు, ఇతర వస్తువులను పరిశీలించి, గ్రామీణ వైద్యుల వైద్య విధానంపై ఆరా తీశారు. మాట్లాడుతూ రోగులకు హై యాంటిబైటిక్స్, స్టెరాయిడ్స్‌ను ఆర్ఎంపీలు వాడుతున్నట్లు గుర్తించామన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్వని, సీహెచ్ఓ ఎం.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జూలూరుపాడు: పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛ భారత్ –స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. అధికారులు స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంఈఓ బానోత్ జుంకీలాల్, హెచ్ఎం ఎస్కే మీరాసాహెబ్, సెక్రటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎల్‌పీఏ సభ్యత్వ నమోదు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం జోరుగా ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) జిల్లా కన్వీనర్ జి.గోపికృష్ణ ఆధ్వర్యంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. విశేష స్పందన లభించిందని గోపీకృష్ణ తెలిపారు. న్యాయవాదులు ఎర్ర శ్రీనివాస రావు, సాయి లహరి తదితరులు సభ్యత్వం తీసుకున్నారు. అంబటి రమేష్, యర్రాపాటి కృష్ణ, మారపాక రమేష్, మహమ్మద్ సాధిక్‌పాషా, అంకుష్ పాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన, రేవంతన్న కా సహారా మిస్కీన్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.యాకుబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, చిరు వ్యాపారులకు స్వయం ఉపాధి పొందేందుకు రూ.50వేలు మంజూరు చేస్తారని తెలిపారు. అక్టోబర్ 6వ తేదీ లోపు **tgobmmr.cff.gov.in** వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యశిబిరం

జూలూరుపాడు: ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా శనివారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు దంతవైద్య నిపుణులు డాక్టర్లు నవీన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తేజశ్వని వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు

పాల్వంచరూరల్: దసరా సందర్భంగా స్కూల్స్‌కు ప్రభుత్వం ఈనెల 20 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు సెలవులు ప్రకటించింది. దీంతో హాస్టళ్లు, గురుకుల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు శనివారం ఇంటిబాట పట్టారు. పాల్వంచ మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాల, కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాల, ఉల్వనూరులోని బాలిక ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పుస్తకాలు, దుస్తులు సర్దుకుని తల్లిదండ్రులతో స్వస్థలాలకు వెళ్లారు.

సుజాతనగర్: దసరా సెలవుల నేపథ్యంలో మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు శనివారం ఇంటిబాట పట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు చేరుకొని తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. తల్లిదండ్రుల రాకతో హాస్టల్ వద్ద కోలాహలం కనిపించింది.

అమ్మవారి ఆలయాలు ముస్తాబు

- రేపటి నుంచి దేవీ నవరాత్రోత్సవాలు
- తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు





రామవరం బస్టాండ్ సెంటర్‌లో అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్) సింగరేణి హెడ్డాఫీస్ వద్ద కనకదుర్గ ఆలయం

కొత్తగూడెంటౌన్: అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు కొత్తగూడెంలోని ఆలయాలు, మండపాలు సర్వం సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి శ్రీదేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులు అమ్మవారి ప్రతిమలను ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారి నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుపుకునేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులను దర్శనం ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంలోని సూపర్‌బజార్, కూలీలైన్, గణేష్ టెంపుల్, రామవరం, పాత కొత్తగూడెం, పాలకేంద్రం, విద్యానగర్‌కాలనీ, హెడ్డాఫీస్, రుద్రంపూర్, గౌతంపూర్, త్రీఇంక్‌లైన్స్‌లతో పాటు పలు ప్రాంతాల్లోని ఆలయాలు, మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించనున్నారు.

అమ్మవారికి ఇష్టమైన రోజులు:..

రుద్రరూపి భద్రకాళిగా ఎనిమిదో రోజు జన్మించిన చాముండి తొమ్మిదో రోజు వీర విహారంతో దైత్య సంహారం చేసిందని పురాణాలు చెబుతున్నాయి. పదో రోజు విజయలక్ష్మీగా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకుంటారు. నవరాత్రుల్లో చివరి మూడు రోజులు అత్యంత ఇష్టమైన రోజులు దుర్గాష్టమి, మహార్నవమి విజయదశమి పేరిట ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటాం. తొమ్మిది అవతారాలు శక్తి స్వరూపిణి, ఆది పరాశక్తి అయిన దుర్గామాతను శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటా, కూష్మాండ, స్కంధమాత కాత్యాయని, కాళారాత్రి మహాగౌరీ, సిద్ధిధాత్రి తొమ్మిది అవతారాల్లో అమ్మవారు పూజలందుకుంటుంది.

సండే స్పెషల్

అమ్మవారి ఆశీర్వాదం ఉంటుంది..



శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవం సందర్భంగా ప్రతీరోజు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరణ చేసి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ఆలయాల్లో, మండపాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. కోరిన కోరికలను తీర్చే అమ్మవారికి పూజలు చేస్తే అందరిపై అమ్మవారి ఆశీర్వాదం ఉంటుంది.

– నరేంద్రభవానీ స్వామి, మహంకాళి అమ్మవారి ఆలయ ఉపాసకులు, బూడిదగడ్డ బస్తీ

మైక్‌సెట్ వితరణ

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు రాంశెట్టి శ్రీనివాసరావు బ్లూటూత్ మైక్‌సెట్‌ను శనివారం హెచ్ఎం లక్ష్మీనర్సయ్యకు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఉపాధ్యాయులు సన్మానించారు. అదేవిధంగా మహిళా టీచర్లు, విద్యార్థినులు బతుకమ్మ ఆడి ఉత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులకు బతుకమ్మ విశిష్టతను వివరించారు.

పాఠశాలకు టీవీ..

సుజాతనగర్: తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ విద్యానగర్ ఆధ్వర్యంలో స్థానిక వేపలగడ్డ ప్రాథమిక పాఠశాలకు శనివారం ఎల్ఈడీ టీవీని బహూకరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ తరగతుల కోసం టీవీ వితరణగా అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాఘవరావు, తిరుపతిరెడ్డి, సీతారామశాస్త్రి, ధర్మారావు, కామేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు నిత్యావసరాల పంపిణీ

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని సత్యసాయి ఆశ్రమంలోని అనాథలకు శనివారం కొత్తగూడెం వరుణ్ ఆర్థోపెడిక్, మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ వరుణ్ కుమార్ నిత్యావసర కిట్లు, మందులు, పండ్లు వితరణ చేశారు. డాక్టర్ వరుణ్‌కుమార్ మాట్లాడుతూ అనాథలకు సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. సహాయం చేయడంలో మానసిక ఉల్లాసంతో పాటు సామాజిక సేవ చేసిన తృప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

సీతారాములుకు గ్రేటర్ ఎక్స్‌లెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగా సీతారాములు

సుజాతనగర్: టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములును ప్రతిష్టాత్మక గ్రేటర్ ఎక్స్‌లెన్సీ అవార్డు–2025 వరించింది. టీపీసీసీ జనరల్ సెక్రటరీగా, యాదవ విద్యావంతుల ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, శ్రీ గోకుల కృష్ణ ట్రస్ట్ చైర్మన్‌గా, బీసీ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ప్రస్తుతం సేవలందిస్తున్నారు. కోవిడ్–19 సమయంలో తన సొంత ట్రస్ట్ ద్వారా సేవలందించి పార్టీలకు అతీతంగా ప్రజల మన్ననలు పొందారు. ఈ క్రమంలో ఆయన సేవలను గుర్తించిన ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీపీసీ) అవార్డుకు ఎంపిక చేసింది. ఆ సంస్థ చైర్మన్ చైతన్యా జంగా, సెక్రటరీ వీఎస్ వర్మ, మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి డైరెక్టర్ చంద్రశేఖర్, కంట్రీ క్లబ్ అధినేతలు రాజీవ్‌రెడ్డి, అనుప్రసాద్ చేతుల మీదుగా ఈ నెల 19న హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నారు.

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య

ఇల్లెందురూరల్: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నతంగా చదువుకోవాలని, దీనికి కళాశాలలోని ప్రతీ అధ్యాపకుడు తోడ్పాటునందిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు ఉన్నాయని, అనుభవం, అంకితభావం కలిగిన అధ్యాపకులు ఉన్నట్లు చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సులోచనరాణి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలని దివ్యాంగుల ధర్నా



జూలూరుపాడు: సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న పింఛన్‌దారులు, నాయకులు



టేకులపల్లి: కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న పింఛన్‌దారులు

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలు బోడ అమ్మి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర వ్యాపిత ఆందోళనల్లో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద ముట్టడి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. మాట్లాడుతూ.. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కండరాల క్షీణత కలిగిన వీరి మీదనే రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జినక ఇస్తారి, మెంతెన ప్రభాకర్, పోలెపొంగు వెంకన్న, శంకర్, రమేష్, యాసం జనార్దన్, వెంకటయ్య, భిక్షు, శంకర్, వెంకటమ్మ, రమాదేవి, రాములమ్మ, కృష్ణకుమారి, కమలమ్మ పాల్గొన్నారు.

జూలూరుపాడు: పెన్షన్‌దారులకు రెట్టింపు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వినోభానగర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రెట్టింపు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. రెండేళ్లు కావస్తున్నా పెన్షన్ పెంచకపోవడం విచారకరమన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి చరిత్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.బాలు, చెంగల గురునాథం, దిబ్బెందుల సాయికుమార్, గార్లపాటి కృష్ణ, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో బతుకమ్మ సంబురాలు

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తుగా శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బతుకమ్మలకు పేర్చి, పూజలు చేసి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. ఆ తరువాత సమీపంలోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సుజాతనగర్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో



ఇల్లెందు: మాంటిస్సోరీ స్కూల్‌లో..



ఇల్లెందురూరల్: కొమరారం ప్రాథమిక పాఠశాలలో..



టేకులపల్లి: నిమజ్జనం చేస్తున్న వాగొడ్డుతండా పాఠశాల విద్యార్థులు



జూలూరుపాడు: ప్రాథమిక పాఠశాలలో..

బతుకమ్మ సంబురాలపై సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందులో బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఏటా ఉత్సవాల నిర్వహణ మున్సిపల్ పాలకవర్గం స్వీకరించేది. ఈసారి ఉత్సవాలకు మున్సిపల్ పాలకవర్గం లేనందున ఆ బాధ్యత ఎమ్మెల్యే కోరం కనకయ్య మీద పడింది. ఇందుకోసం శనివారం తన క్యాంపు కార్యాలయంలో డీఎస్పీ చంద్రభాను, సీఐ సురేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, డీఈ మురళీల, కాంగ్రెస్ నాయకులతో సమావేశమై చర్చించారు. వార్డు వారీగా మహిళలతో సమావేశం నిర్వహించి బతుకమ్మ, దసరా ఉత్సవాలపై చర్చించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో బానోతు రాంబాబు, మడుగు సాంబమూర్తి, సదానందం, బోళ్ల సూర్యం, డానియేల్, పులి సైదులు, యదళ్లపల్లి అనసూర్య, కల్తీ పద్మ, గాలిపల్లి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ సర్వేతో న్యాయం చేయండి..

ఇల్లెందురూరల్: జేకే ఓసీ విస్తరణలో భాగంగా సింగరేణి స్వాధీనం చేసేకునేందుకు ప్రతిపాదించిన సర్వే నంబర్ 549లో జాయింట్ సర్వే చేయించి భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని మండలంలోని స్టటిఫిట్ గ్రామపంచాయతీ రైతులు శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ.. తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటూ గతంలో పట్టాలు పొంది ఉన్న తమకు రెవెన్యూ, అటవీశాఖల అధికారులు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అటవీ, రెవెన్యూ సర్వేయర్లతో జాయింట్ సర్వే నిర్వహిస్తే భూముల హద్దులు తేలుతాయని పేర్కొన్నారు. ఇదే విషయమై గతంలో కలెక్టర్ ఆదేశించినా స్థానిక అధికారులు సర్వే చేయకుండా ఇటీవల జరిగిన గ్రామసభలో ఏకపక్షంగా భూములను సింగరేణికి అప్పగించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు నిర్వాసిత రైతులు తెలిపారు.

ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి



రాజ్యలక్ష్మి

చుంచుపల్లి: ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో కొత్తగూడెం ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మేనేజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోనే అతిపెద్ద డిపో బాధ్యతలు చేపట్టడం సవాలే అన్నారు. ఇక్కడ నుంచి హైదరాబాద్‌తో పాటు అన్ని మార్గాలకు బస్సులు నడుస్తాయని, అత్యధిక సంఖ్యలో కొత్తగూడెం బస్టాండ్‌కు ప్రయాణికుల తాకిడి ఉంటుందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించటమే తమ కర్తవ్యమన్నారు. డిపో నుంచి ఆదాయం వచ్చే మార్గాలకు ఎక్కువ సంఖ్యలో బస్సు సర్వీసులను నడిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. దసరాకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. బస్టాండ్, డిపో పరిసర ప్రాంగాణాలను నిరంతరం పర్యవేక్షిస్తానని తెలిపారు.

పరిశుభ్రత, భద్రతపై అవగాహన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం వీధి వ్యాపారులకు పరిశుభ్రత, భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెప్మా అధికారులు మాట్లాడుతూ వీధి వ్యాపారులు తయారు చేసే ఆహార పదార్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వీధి వ్యాపారులకు ఉచితంగా ఫుడ్ లైసెన్స్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుజాత, మెప్మా పీడీ సీహెచ్.రాజేష్, ఏడీఎంసీ, కమ్యూనిటీ ఆర్గనైజర్స్, రిసోర్స్‌పర్సన్స్, తనుషా, వీధి వ్యాపారులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకు పూలు కరువు



మస్సివాగు గ్రామంలో బంతితోట

ఇల్లెందురూరల్: బతుకమ్మ అంటేనే పూల పండుగ. ప్రకృతిలోని పూలను తెచ్చి.. చక్కగా పేర్చి.. వాటిపై గౌరమ్మను పెట్టి ఆటపాటలతో పూజించే పండుగ. ఇందులో ఉపయోగించే పూలకు చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. కానీ ఇప్పుడు పూలే కరువయ్యాయి. అభివృద్ధి పేరిట చెట్లను నరుకుతూ.. అడవులు అంతరింప జేస్తుండటంతో పూల జాడ లేకుండా పోతోంది. ఓ వైపు ప్రభుత్వం పండుగను అధికారికంగా చేపడుతున్నా.. అసలు బతుకమ్మ పూలే కరవయ్యే పరిస్థితులు ఉన్నాయి. గతంలో ఏ అటవీ ప్రాంతానికి వెళ్లినా బతుకమ్మకు కావలసిన తంగేడు పూలు కనిపించేవి. రోడ్ల పక్కన గుంపులు గుంపులుగా చెట్లు.. వాటి నిండా పసుపు రంగులో పూలు ఆకర్షించేవి. ప్రస్తుతం కిలోమీటర్ల కొద్ది దూరం వెళ్లినా తంగేడు జాడ లేదు. వ్యవసాయ భూముల్లో రసాయనాలు, ఎరువుల వాడకం పెరగడంతో గునుగు పూల చెట్లు కనిపించకుండా పోయాయి. బతుకమ్మను పేర్చడంలో ప్రధానంగా అడుగు భాగాన తంగేడు, పైన గునుగు పూలనే ఉంచుతారు. వీటితోపాటు బతుకమ్మ వేడుకల నాటికి పూలు పూసేలా ఇళ్ల ఆవరణలో వర్షాకాలం ప్రారంభంలో మహిళలు పూల మొక్కలు నాటుకుంటారు. కానీ ప్రస్తుతం కోతుల బెడదతో పూల మొక్కలను సైతం పెంచడం మానేశారు. చీడపీడల బెడదతో పూలతోటల సాగు విస్తీర్ణం కూడా క్రమంగా తగ్గిపోయింది. ఇలా బతుకమ్మ పేర్చడానికి వినియోగించే పువ్వులు లేక బతుకమ్మ ఎత్తునూ తగ్గిస్తున్నారు. చివరకు కాగితపు పూల బతుకమ్మలనే వాడే పరిస్థితి ఏర్పడింది. ఏటా బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహిస్తామని చెబుతున్న పాలకులు తంగేడు, గునుగు పూల గురించి ఆలోచించాలని మహిళలు కోరుతున్నారు.

జీపీలకు భారంగా పూల పండుగ

- నిధుల లేమితో నామమాత్రంగా ఏర్పాట్లు
- పల్లెల్లో కనిపించని లైటింగ్ సౌకర్యం



21పిట్ ఏరియాలో నామమాత్రపు పనులతో బతుకమ్మ వేడుకలు జరగనున్న ప్రాంతం

ఇల్లెందురూరల్: తెలంగాణ మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకునే అపురూపమైన వేడుక పూల పండుగ. ఈ వేడుకను సంబురంగా జరుపుకునేందుకు వారం పదిరోజుల నుంచే ఆడపడుచులు తల్లిగారింటికి చేరుకుని సందడి చేస్తారు. ఆర్థికంగా ఉన్న వారైనా.. పేదవారైనా.. ఈ పది రోజులపాటు కష్టాలన్నీ మరిచి ఆనందంగా ఆడుకునే పండుగ బతుకమ్మ.

పంచాయతీ నిధులతో వైభవంగా..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక నాటి ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. రాష్ట్రమంతటా బతుకమ్మ వేడుకలను అధికారికంగా.. అంగరంగ వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. కానీ గతంలో బతుకమ్మ వేడుకలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల్లో సంబురాలకే సరిపోయేవని పల్లెవాసులు పెదవి విరిచేవారు. అయినా పల్లెల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పంచాయతీ సాధారణ నిధులను వేడుకలకు ఖర్చు చేసి మహిళలు ఆనందంగా బతుకమ్మ ఆడుకునేలా ఏర్పాట్లు చేసేవారు. ప్రతీ గ్రామంలో కూడళ్లలో శుభ్రం చేసేవారు. పూల పండుగ రాత్రి వేళలో ఘనంగా నిర్వహించుకునేలా లైటింగ్ సౌకర్యం కల్పించేవారు.

ప్రస్తుతం భారమైన ఏర్పాట్లు...

గడిచిన నాలుగేళ్లుగా గ్రామపంచాయతీలకు నిధుల మంజూరు లేకపోవడంతో ప్రస్తుతం పల్లెల్లో కనీస పనులు కూడా ముందుకు సాగడం లేదు. కనీసం ట్రాక్టర్లకు డీజిల్ పోసే ఆర్థిక స్థోమత కూడా లేకపోవడంతో రోజువారీ నిర్వహించే చెత్త సేకరణ సైతం పల్లెల్లో అటకెక్కింది. ఇంతేకాకుండా పంచాయతీలో పనిచేసే సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లింపు నిలిచిపోవడం పంచాయతీ అధికారులకు పెద్ద సమస్యగా మారింది. పండుగ వేళ పస్తులుంటూ పనులు ఎలా చేయాలని పంచాయతీ కార్మికులు అధికారులను ప్రశ్నిస్తున్న క్రమంలో పండుగ ఏర్పాట్ల కోసం వారిని అడగడం ఎలా పంచాయతీ కార్యదర్శులు ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీల్లో చిల్లిగవ్వ లేదు.. తొమ్మిది రోజుల పండుగకు ఏర్పాట్లు ఎలా చేయాలి, ప్రజలను ఎలా సంతృప్తి పర్చాలని పంచాయతీ కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. దీనికితోడు ప్రస్తుతం పంచాయతీలకు ప్రజాప్రతినిధులు లేకపోవడం, ప్రత్యేకాధికారులు ఈ వ్యవహారంలో తమకేమీ పట్టనట్లుగా ఉండటం కూడా పంచాయతీ అధికారులకు పండుగ ఏర్పాట్లు భారంగా మారినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే పంచాయతీ నిర్వహణకు రూ.లక్షల్లో వెచ్చించి అప్పుల పాలైన కార్యదర్శులు బతుకమ్మ ఏర్పాట్లకు నిధులు ఖర్చు చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఈ కారణంగా ఈ దఫా పల్లెల్లో అసౌకర్యం మధ్యనే పూల పండుగ కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

నామమాత్రంగా పనులు..

పల్లెల్లో మహిళలు ఆనందంగా బతుకమ్మ ఆడుకునేలా కూడళ్లలో చెత్తచెదారం లేకుండా శుభ్రం చేయాలి. రాత్రి వేళలో జరుపుకునే వేడుక అయినందున ప్రతీ వీధిలో లైటింగ్ ఏర్పాటు చేయాలి. బతుకమ్మ ఆడుకునే ప్రాంతంలో ప్రత్యేకంగా లైటింగ్ సౌకర్యం మెరుగుపర్చాలి. ఇవన్నీ ఏటా కొనసాగుతున్న సౌకర్యాలే.

కానీ ప్రసుత్తం నిధుల లేమితో సతమతమవుతున్న పంచాయతీలకు ఈసారి సౌకర్యాలు కల్పించడం భారంగా మారింది. ప్రస్తుతం పల్లెల్లో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు నామమాత్రంగా సాగుతున్నాయి. గ్రామ కూడళ్లలో అరకొర పనులతో నెట్టుకొస్తున్నారు. ఇక వెలుతురు సౌకర్యం చాలా గ్రామాల్లో లేదు. పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ఇది అన్ని గ్రామాల్లో లేకపోవడం బతుకమ్మ సంబురాలపై ప్రభావం చూపుతోంది.

లైటింగ్ సౌకర్యం కల్పించాలి..



ఇళ్లలో అందంగా పేర్చిన బతుకమ్మలను గ్రామ కూడళ్లలోకి తెచ్చి గౌరమ్మను ప్రతిష్ఠించి పూజ చేస్తాం. అనంతరం బతుకమ్మను స్మరిస్తూ ఆటపాట కొనసాగిస్తాం. ఇది రాత్రి వరకు కొనసాగుతుంది. అధికారులు కూడళ్లలో లైటింగ్ సౌకర్యం కల్పించాలి.

– వేముల సుగుణ, బాలాజీనగర్

సౌకర్యాల కల్పనకు కృషి..



పంచాయతీలలో నిధుల లేమి సమస్యగా ఉంది. అయినా గ్రామాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించేకునేలా కూడళ్లలో పంచాయతీ వర్కర్ల సహాయంతో శుభ్రం చేయిస్తున్నాం. అన్నిచోట్ల ప్రత్యేకంగా లైటింగ్ సౌకర్యం కల్పిస్తాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు